సాక్షి సిద్దిపేట

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



మామిడి ప్రియం

మామిడి పూత, కాత ఆశాజనంగా ఉన్నాయి. దీంతో అమ్మకాలు జోరందుకున్నాయి.

వివరాలు 8లో ▸



మట్టి దందాపై కొరడా

అక్కన్నపేట మండలం గౌరవెల్లి, కట్కూర్, రేగొండల్లో మట్టి దందా జోరుగా కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸



నర్సరీల్లో గ్రీన్ షెడ్‌నెట్

ఎండ నుంచి మొక్కలను సంరక్షించాలని చలువ పందిళ్లు వేస్తున్నారు.

వివరాలు 9లో ▸

సాఫ్ట్‌వేర్ టూ సాగు



ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని అన్న కవి మాటలను ఈ దంపతులు అక్షరాల నిజం చేస్తున్నారు. విదేశాల్లో విలాసవంతమైన జీవితం, డాలర్లు, ఆధునిక సౌకర్యాలను వదులుకుని స్వదేశం చేరుకున్నారు సిద్దిపేటకు చెందిన సామ సునీతారెడ్డి, ఎల్లారెడ్డి దంపతులు. కంప్యూటర్లను పక్కన పెట్టి మట్టి మనుషులుగా జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయానికి ఆధునిక సొబగులు అద్దుతూ సేంద్రియ సాగును లాభసాటిగా మార్చారు. డాలర్ డ్రీమ్స్‌లో ఆనందం దొరకదని, మనసుకు నచ్చిన పని చేస్తే మట్టి పరిమళం కూడా అంతులేని సంతోషాన్ని అందిస్తుందంటున్న వీరిపై ఈ వారం ప్రత్యేక కథనం.

గజవెల్లి షణ్ముఖ రాజు, సాక్షి సిద్దిపేట

సేంద్రియం కోసం సొంతూరుకు

- డాలర్ డ్రీమ్స్ వదిలి మట్టి మనుషులుగా జీవనం
- ఆరోగ్య కరమైన ఆహారమే లక్ష్యం
- ఆదర్శంగా నిలుస్తున్న దంపతులు

ఎన్ని దేశాలు తిరిగినా.. ఏ ప్రాంతమైనా నాది అనే అభిప్రాయం కలగదు. సొంత ఊరులో ఉన్న ఆనందం ఎక్కడా దొరకదు. మన దేశంలో ఉన్న ప్రకృతి, ఆహారం ఇతర దేశాలలో లభించవు. పిల్లలకు జంక్‌ఫుడ్ అందించవద్దన్న ఉద్దేశంతో స్వదేశానికి తిరిగి వచ్చి సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన ఆహారాన్ని అందిస్తున్నారు సామ సునీతారెడ్డి, ఎల్లారెడ్డి దంపతులు. అంతేకాదు.. వేలాది మందికి సైతం ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తుండటం విశేషం.

సండే స్పెషల్

అమెరికా టూ సిద్దిపేట

సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం లింగంపల్లికి చెందిన ఎల్లారెడ్డి బీకాం కంప్యూటర్ చదివారు. తర్వాత ఫ్రాన్స్ దేశం వెళ్లి ఎంబీఏ (కమ్యూనికేషన్) పూర్తి చేసి ఆ దేశంలోనే మాడ్రిడ్ నగరంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. తర్వాత స్పెయిన్, దుబాయి, అమెరికా దేశాలు తిరుగుతూ ఎనిమిదేళ్లు గడిచాయి. సీనియర్ కన్సల్టెంట్‌గా నెలకు రూ.2లక్షలకుపైగా ఆదాయం వచ్చేది. గ్రీన్ కార్డు సైతం వచ్చింది. జీవితంలో ఇక సెటిల్ అనే భావనకు బదులు ఏదో తెలియని వెలితి మొదలైంది. దీంతో ఒక్కసారిగా ఆత్మావలోకనం చేసుకుంటే రోజంతా కంప్యూటర్ దగ్గరే కూర్చుని వర్క్ చేయడంతో ప్రకృతికి దూరమవుతున్నామని గమనించారు.

రోజూ ధ్యానం..

దీంతో అక్కడే సహజ యోగా కార్యక్రమానికి వెళ్లేవారు. సముద్రం ఒడ్డున, అడవులలో ధ్యానం చేయడం ప్రారంభించారు. ప్రకృతితో ఎంతో సంతోషంగా ఉండగలుగుతున్నామని గుర్తించారు. అంతే మరింతగా ప్రకృతితో మమేకం కావాలంటే పుట్టి పెరిగిన నేలకు వెళ్లాల్సిందే అనే అభిప్రాయం బలపడింది. అనుకున్నదే తడవుగా 2012లో రెండేళ్ల బాబును చంకనెత్తుకొని ఇండియాకు తిరిగి వచ్చారు. వైట్ కాలర్ జాబ్ వదులుకుని ఇక్కడికి వచ్చి ఏం చేస్తారంటూ అమ్మానాన్నలు, తెలిసిన వాళ్లు ప్రశ్నించారు. చేజేతులా జీవితాన్ని నాశనం చేసుకోవద్దంటూ హెచ్చరించారు. కానీ వారు మనసు మాటే విన్నారు.

డెయిరీ ఫామ్

సేంద్రియ సాగు అందించిన ప్రోత్సాహంతో డెయిరీ ఫామ్ ఏర్పాటు చేశారు. 40 గిర్ దేశీయ ఆవులు పెంచుతున్నారు. వీటికి మేత వారి పొలంలోనే పండిస్తారు. పూర్తిగా సేంద్రియ పద్ధతిలోనే పచ్చి గడ్డిని సాగుచేస్తున్నారు. మేత బలవర్ధకంగా ఉండడం వల్ల రోజూ దాదాపు 100 లీటర్ల పాలు అమ్ముతున్నారు. స్వచ్ఛమైన నెయ్యి, వెన్న, పెరుగు సైతం విక్రయిస్తున్నారు. హైదరాబాద్ కు కూడా కొన్ని ఇళ్లకు రోజూ పాలు చేరవేస్తుంటారు.

అవుట్‌లెట్ ద్వారా విక్రయాలు

మట్టి మనుషులుగా ఉండాలని 2013లో సిద్దిపేట జిల్లా మత్రిముచ్చ్యాల గ్రామం సమీపంలో ఆరు ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. తొలుత జెర్బరా పూలు సాగు చేశారు. ఆ తర్వాత సేంద్రియ వ్యవసాయం వైపు సాగారు. దళారి వ్యవస్థ వల్ల రైతుకు, వినియోగదారునికి ఆత్మీయ సంబంధం లేకుండా పోయిందనే విషయం గుర్తించారు. దీంతో వినియోగదారుడి దగ్గరికే నేరుగా వెళ్లారు.. పండించిన వడ్లు, ఇతర పప్పులు, పండ్లను విక్రయించేందుకు తామే సొంతగా ఆహార యోగా పేరుతో అవుట్‌లెట్‌ను సిద్దిపేటలో ప్రారంభించారు. భర్త పండిస్తుంటే భార్య సునీతారెడ్డి వాటిని విక్రయించడం మొదలెట్టారు.



స్ఫూర్తిగా నిలుస్తూ..

ఆహార యోగా విక్రయ కేంద్రం ద్వారా ఇప్పుడు వందలాది మందికి సేంద్రియ ఆహారాన్ని అందిస్తున్నారు. గ్రామభారతి నేచురల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రారంభించి సేంద్రియ వ్యవసాయం చేసే రైతులను ఏకం చేశారు. అలాగే పలువురు రైతులను ప్రోత్సహించి వారిని సేంద్రియ సాగు వైపు మళ్లిస్తున్నారు. వడ్లు, కూరగాయలు, పండ్లు, పప్పులు, చిరు ధాన్యాలను వీరి పర్యవేక్షణలో పండిస్తున్నారు. ఎలాంటి రసాయన ఎరువులను చల్లడం, పిచికారీ చేయకుండా సాగు చేస్తున్నారు.

సంతృప్తిగా జీవిస్తున్నాం

మేము ఇద్దరం నాలుగేళ్లు ఉద్యోగ రీత్యా దేశాలు తిరిగాం. అక్కడ అంతా జంక్ ఫుడ్ లభించేది. ప్రకృతిపై ప్రేమతో సహజ యోగా కార్యక్రమానికి వెళ్లాం. మా మనసు మార్చుకుని రెండేళ్ల అబ్బాయిని తీసుకుని ఇండియాకు వచ్చాం. ఇప్పుడు ఆనందకరమైన జీవనం సాగిస్తున్నాం. అక్కడి ఆదాయంతో పోలిస్తే తక్కువగా వస్తున్నప్పటికీ సంతృప్తిగా జీవిస్తున్నాం. సిద్దిపేట, కరీంనగర్‌లలో రెండు చోట్లా ఆర్గానిక్ స్టోర్లను ఏర్పాటు చేసి పలువురి ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తున్నాం.

– సామ సునీతా రెడ్డి, ఎల్లారెడ్డి

న్యూస్‌రీల్

ఆయిల్‌పామ్ గింజలకు డిమాండ్



రైతులకు సూచనలు చేస్తున్న అధికారి పండరి

కొండపాక(గజ్వేల్): ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని గజ్వేల్ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి సీహెచ్ పండరి పేర్కొన్నారు. మండలంలోని బందారంలో రైతు వెంకట్‌రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను శనివారం పరిశీలించి సాగుపై రైతులకు తగు సూచనలు, సలహాలు చేశారు. ఎండలు ముదిరిన తరుణంలో మొక్కలకు అధిక శాతం నీరు అవసరపడుతుందన్నారు. ఆయిల్ పామ్ గింజలకు మార్కెట్లో అధిక శాతం డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ హరీష్, ఆయిల్ ఫెడ్ ప్లాంట్ మానిటర్ ఆఫీసర్ విజయ్ పాల్గొన్నారు.

శిక్షణ తీసుకోండి: డీపీఓ



పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని సందర్శించిన డీపీఓ

హుస్నాబాద్: పొడి చెత్త సేకరణ కేంద్రం, సేంద్రీయ ఎరువు తయారు చేసే కేంద్రాలను శనివారం డీపీఓ దేవకీ దేవి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సందర్శించారు. అక్కడ పని చేసే మున్సిపల్ సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. సిద్దిపేటలోని స్వచ్ఛ బడికి వచ్చి సేంద్రియ ఎరువు తయారు చేసే విధానంపై ట్రైనింగ్ తీసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: మాతాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు జిల్లాలోని బాలికల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రి శనివారం తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన అనాథలైన బాలికలు ఎలాంటి ప్రవేశ పరీక్ష ఉండదని పేర్కొన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు మే 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం 9000357750 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దీపదాస్ మున్షీకి స్వాగతం



దీపదాస్‌కు స్వాగతం పలుకుతున్న నేతలు

కొండపాక(గజ్వేల్): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజారిటీ సాధించేలా కృషి చేయాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ కోరారు. కొండపాక మండలం దుద్దెడ శివారు నాగుల బండ వద్ద పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేటలో పార్టీకి పూర్వ వైభవం వచ్చేలా పని చేయాలన్నారు. ఆగస్టు 15న కచ్చితంగా ప్రభుత్వం రైతు రుణమాఫీని చేసి తీరుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మల యాదగిరి, ఇమాం, శంకర్, నాయిని నర్సింహారెడ్డి, పూజల గోపీకృష్ణ, సాయి ప్రతాప్, హర్షత్, దాస అంజయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగు చేపట్టండి

మర్కూక్(గజ్వేల్): పామాయిల్ సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని, ఒక ఎకరా వరిసాగుకు అసరమైన నీటితో నాలుగు ఎకరాల పామాయిల్ పంటను సాగు చేయవచ్చని జిల్లా ఉద్యాన అధికారి సువర్ణ పేర్కొన్నారు. మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన రైతు సుధాకర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పూల గుత్తులను తీసే విధానం గురించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పామాయిల్ మొక్కలను నాటిన 14 నెలల నుంచి పూతకు వస్తాయన్నారు. చెట్టు తొలి దశలో వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందాలంటే ఈ పూల గుత్తులను వెంటనే తుంచి వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పామాయిల్ డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుడి పర్యటన

గజ్వేల్: మెదక్ లోక్‌సభ ఎన్నికల వ్యయ పరిశీలకులు సునీల్‌కుమార్ శనివారం గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ నియోజకవర్గ పరిధిలోని వంటిమామిడి, జగదేవ్‌పూర్, బేగంపేట, కాళ్లకల్ చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఆ తర్వాత గజ్వేల్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల నిఘా బృందాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

జంపింగ్ జపాంగ్!

కాంగ్రెస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ నుంచి కొంతమంది ముఖ్యనేతలు చేరారు. ఆపార్టీల నుంచి ముఖ్యనేతలతోపాటు ద్వితీయ శ్రేణి నేతలను చేర్చుకునేందుకు యత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎంపీ ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలో అధికార పార్టీ పట్టు కోసం ప్రయత్నిస్తుంది. ప్రచారాన్నే అస్త్రంగా మార్చుకొని అధికార పార్టీ తామేమి చేయగలమో చెప్పకుంటూ వెళ్తుంది. బీఆర్ఎస్ గ్రామస్థాయి నుంచే ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని దూసుకుపోతోంది. బీజేపీ ఇప్పటికే గజ్వేల్ నియోజకవర్గాన్ని పలుమార్లు చుట్టేసింది.

- కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్, బీజేపీ ముఖ్యనేతలు
- ఇప్పటికే పలువురి చేరిక
- ప్రస్తుతం అధికార పార్టీలోకి హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూంరెడ్డి
- పట్టు కోసం రాజకీయ పార్టీల ప్రయత్నాలు



సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన భూంరెడ్డి తదితరులు

గజ్వేల్: నియోజకవర్గంలో అధికార పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ నుంచి ముఖ్యనేతలను చేర్చుకునే ప్రక్రియ జోరుగా సాగుతుంది. ఇప్పటికే నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్యనేతలు తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, బీజేపీకి చెందిన గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ కాంగ్రెస్‌లో చేరారు. శనివారం ఇదే నియోజకవర్గంలోని కొండపాక మండలానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేత, కేసీఆర్ సన్నిహితుడు, మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి సైతం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిపోయారు. చేరికల ప్రక్రియ వేగంగా సాగుతుండటం బీఆర్ఎస్, బీజేపీలను కలవరపరుస్తుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సాధించిన ఓట్ల కంటే కనీసం ఒక్క ఓటైనా ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో ఎక్కువగా సాధించాలనే సంకల్పంతో కాంగ్రెస్ పావులు కదుపుతుంది. డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో చేరికలు సాగుతున్నాయి. ముఖ్యనేతలనే కాదు ద్వితీయ శ్రేణి నేతలను కాంగ్రెస్‌లోకి ఆయన ఆహ్వానిస్తున్నారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకోవడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్‌పై పైచేయి సాధించడానికి అధికార పార్టీ సర్వశక్తులు ఒడ్డుతుంది. నియోజకవర్గంలో పట్టున్న నేతలను చేర్చుకోవడం వెనుక వారి ఎత్తుగడ స్పష్టంగా కనిపిస్తుంది. అధికార పార్టీ అనుకూలతలను ప్రచారం చేస్తూ ముందుకు సాగుతున్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితులకు ప్రస్తుత బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి వల్ల తీవ్ర అన్యాయం జరిగిందని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. కాగా బీఆర్ఎస్ సైతం తనదైన శైలిలో ప్రచార కార్యక్రమాలను చేపడుతుంది. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నీ తానై ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే ఎంపీ ఎన్నికల్లోనే మెజార్టీ సాధించాలనే పట్టుదల కనిపిస్తుంది. ఇందుకోసం గ్రామస్థాయి నుంచి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. చేరికలతో అధైర్య పడవద్దని పార్టీ యంత్రాంగానికి ధైర్యం చెబుతున్నారు. బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటింపజేస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక బీజేపీ సైతం నియోజకవర్గంలో తన ప్రచార కార్యక్రమాలను జోరుగానే కొనసాగిస్తుంది. పార్టీ అభ్యర్థి రఘునందన్‌రావు ఇప్పటికే పలుమార్లు గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పర్యటించి కార్యకర్తలను ఉత్తేజపరిచే ప్రయత్నం చేస్తున్నారు.

సుపరిపాలన అందించాం

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

సిద్దిపేటజోన్: అందరి దీవెనలు, ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి పదేళ్లు సుపరిపాలన అందించినట్టు మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. శనివారం పొన్నాల శివారు.. పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఆయన జెండాను ఆవిష్కరణ గావించారు. అలాగే బ్రాహ్మణ పరిషత్ సభ్యులు సిద్దిపేటలో ఎమ్మెల్యే ను కలిశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, సీనియర్ నాయకులు రాజనర్స్, వేణుగోపాల్ రెడ్డి, సంపత్, సాయిరాం, రాములు, రాంకుమార్ గౌడ్, వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు సుందర్, అరవింద్, మోహిజ్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

పిల్లలులేని దంపతులకు మంచి చాన్స్

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: పిల్లలు లేరనే భావనతో బాధపడే దంపతులు అధికారికంగా పిల్లలను దత్తత కోసం సిద్దిపేటలోని శిశుగృహను సంప్రదించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 6 నెలల పాపను పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన దంపతులకు ఆమె తన చేతుల మీదుగా అధికారికంగా దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలో గల శిశు గృహ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దత్తత తీసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం అన్ని రకాల విచారణల అనంతరం పిల్లలను దత్తత తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తద్వారా ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవన్నారు. డీడబ్ల్యూఓ సావిత్రి, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ మమత పాల్గొన్నారు.

24 గంటలు వైద్యసేవలు అందాలి

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ రవీందర్

కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారికి ఆనుకొని ఉన్న ఆసుపత్రుల్లో 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉండాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ బి. రవీందర్‌నాయక్ అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఇక్కడ అందుతున్న వైద్యం తీరును, రికార్డును, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డెలివరీలపైన, ఇక్కడి పరిధిలో ఉన్న ఉప కేంద్రాల పని తీరులను సైతం అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ గదిని పరిశీలించారు. ఇది వరకు ఇక్కడ అందుతున్న వైద్య సేవల విషయమై జాతీయ స్థాయిలో అవార్డులు పొందిందని, అదే తరహాలో వైద్య పరంగా నాణ్యతా ప్రమాణాలు కొనసాగుతున్నాయా? అని రోగులను హాస్పిటల్‌కు వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పిట్ల శ్రీనివాస్, వైద్యులు పర్వీన్, బల్‌బీర్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగ్ ఆఫీసర్ సుమిత్ర, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

102 వాహనాలను వినియోగించుకోవాలి

సిద్దిపేటకమాన్: గర్భిణులను వైద్య పరీక్షల నిమిత్తం సంబంధిత ట్యాగ్ సెంటర్లకు, ఆసుపత్రులకు తరలించేందుకు గాను 102 వాహనాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రజా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. జిల్లాలోని సిద్దిపేట నాసర్‌పూర అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తిమ్మాపూర్ పీహెచ్‌సీ, కుకునూర్‌పల్లి పీహెచ్‌సీలను డీఎంహెచ్ఓ శ్రీనివాస్‌తో కలిసి ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీల్లోని పలు రికార్డులను, ల్యాబ్, ఫార్మసీ విభాగాలను పరిశీలించి, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. తిమ్మాపూర్ పీహెచ్‌సీ ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వినోద్‌బాబ్జి, డాక్టర్ విజయరాణి, డాక్టర్ రజని, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీకాంత్, డానియల్, రాజేందర్, కాల్వ చక్రధర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొండపాక : కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బందితో రవీందర్‌నాయక్

నిప్పుల కుంపటి

44 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

- భానుడి భగ భగ.. ప్రజలు విలవిల
- ఉదయం 7 గంటలకే 30 డిగ్రీల టెంపరేచర్
- నిర్మానుష్యంగా రహదారులు
- మే లో మరింత ఉష్ణోగ్రతలు పెరిగే చాన్స్ ఉందన్న వాతావరణ శాఖ

సిద్దిపేట జిల్లాలో రోజూ గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటుతోంది. వేసవి కాలం దృష్ట్యా ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో జిల్లా వాసులు అల్లాడిపోతున్నారు. మూడు రోజులుగా జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో సిద్దిపేట జిల్లా నిప్పుల కుంపటిలా మండుతుంది. ఉదయం 7 గంటల నుండే భానుడు 30 డిగ్రీల ఉష్ణోగ్రతతో నిప్పులు చెరుగుతున్నాడు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

ప్రజలు ఉక్కపోతలు, వేడి గాలులు విస్తుండటంతో అల్లాడుతున్నారు. ఇక వాహనదారులు, ప్రయాణికులైతే ఈ వేడి గాలులకు అనారోగ్యానికి గురవుతున్నారు. కూలీలు పనులు చేసుకునే వీలు లేకుండాపోతుంది. మహిళలు ఇంటి అవసరాలకు అవసరమైన సామగ్రికి వెళ్లాలంటే జంకుతున్నారు. అప్పటికే గృహాల్లో వినియోగిస్తున్న కూలర్, ఫ్యాన్‌లు శరీరతాపం నుంచి ఉపశమనం కలిగించలేకపోతున్నాయి. ఏప్రిల్ చివరి వారంలోనే ఎండ దంచికొడుతుంటే మే నెలలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రజలు చేసేది లేక తాపాన్ని తగ్గించేందుకు గాను శీతల పానీయాలు, మజ్జిగ, కొబ్బరిబోండాలు, పండ్ల రసాలు, సబ్జా నీరు తాగేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. పనుల నిమిత్తం బయటికి వెళ్లే వారు గొడుగులు రక్షణ కవచంగా వాడుతున్నారు. అయినా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గంటగంటకు 2 డిగ్రీలు పెరుగుతుంది. ఇక మధ్యాహ్న సమయాల్లో పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు వెలవెలపోతున్నాయి. ఎప్పుడు రద్దీ ఉండే జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తా, డిగ్రీ కళాశాల చౌరస్తా, నర్సాపూర్ చౌరస్తాలతో పాటుగా గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్, చేర్యాల పట్టణ ప్రధాన వీధులు జనం లేక బోసిపోతున్నాయి.



మూడు రోజులుగా..

వారం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
గురువారం	43.2
శుక్రవారం	44.3
శనివారం	44

మధ్యాహ్న సమయంలో ప్రజలు లేక బోసిపోయిన సిద్దిపేట పట్టణ ప్రధాన చౌరస్తాలు

క్లుప్తంగా

రామేశ్వర్‌సింగ్‌ను కలిసిన సీపీ అనురాధ



రామేశ్వర్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: మెదక్ పార్లమెంట్ లోక్‌సభ ఎన్నికల పోలీసు అబ్జర్వర్ రామేశ్వర్ సింగ్‌ను మేడ్చల్ అబ్జర్వర్ కార్యాలయంలో సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా భౌగోళిక పరిస్థితులు, లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి తీసుకుంటున్న ముందస్తు చర్యలు, జిల్లాలో 12 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఆకస్మిక వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నట్లు సీపీ అనురాధ రామేశ్వర్‌సింగ్‌కు వివరించారు. ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికల నిర్వహణ గురించి ఇరువురు అధికారులు చర్చించారు. సీపీ అనురాధ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే లోక్‌సభ ఎన్నికల పోలీసు అబ్జర్వర్ రామేశ్వర్‌సింగ్ 91772 99185 కు సమాచారం అందించాలని సూచించారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

డీఎంజీ బాల కిషన్



రైతులతో మాట్లాడుతున్న డీఎంజీ బాల కిషన్

మిరుదొడ్డి(దుబ్బాక): ధాన్యాన్ని విక్రయించడానికి రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని డీఎంజీ బాల కిషన్ సూచించారు. మండల పరిధిలోని అల్వాల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రాల్లో వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలన్నారు.

ఇల్లు దగ్ధం

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన అక్కన్నపేట మండలం పంతుల్‌తండా గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన బట్టు రాజు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయింది. ఇంట్లో దాచిన రూ.50 వేల నగదు, బియ్యం, ఇతర వస్తువులు కాలి బూడిదపాలైనట్లు గ్రామస్తులు తెలిపారు.

మామిడి ప్రియం



జహీరాబాద్ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మామిడి పండ్లు

మార్కెట్‌లో ఫలరాజుకు మంచి డిమాండ్

- జహీరాబాద్‌లో జోరందుకున్న అమ్మకాలు
- గతేడాది కంటే మెరుగైన ధర
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: వేసవి కాలం ప్రారంభమైందంటే మామిడి పండ్లకు ఉండే డిమాండే వేరు. కొన్నేళ్లుగా నష్టాలు చవిచూస్తున్న మామిడి ఈ ఏడాది కొండెక్కి కూర్చుంది. పూత, కాత ఆశాజనకంగా ఉండడంతో మంచి దిగుబడి వస్తోంది. ఈదురు గాలులు వంటి ప్రకృతి పరంగా పెద్దగా నష్టం జరగలేదు. ప్రస్తుతం సీజన్ కావడంతో జహీరాబాద్ ఫ్రూట్ మార్కెట్‌కు మామిడి కళ వచ్చింది. గిట్టుబాటు ధర లభిస్తుండడంతో క్రయవిక్రయాలు జోరందుకున్నాయి.



- జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరువు, అందోల్ తదితర ప్రాంతాల్లో మామిడి తోటలు ఉన్నాయి. జహీరాబాద్ ప్రాంతం నేల మామిడికి అనుకూలంగా ఉండడంతో అధిక విస్తీర్ణంలో రైతులు మామిడి తోటలను వేశారు. బంగినపల్లి, పెద్ద రసాలు, చిన్న రసాలు, కెసరి, మల్లిక, హిమాయత్ తదితర మేలైన రకాల తోటలు ఉన్నాయి. జహీరాబాద్ ప్రాంతంలో పండిన మామిడి పంటలో 75 శాతం హైదరాబాద్ కర్నాటక, మహారాష్ట్రలకు ఎగుమతి అవుతుంది.
- ప్రతీ సంవత్సరం జిల్లాలో ఐదారు టన్నుల వరకు పంట దిగుబడి వస్తుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించక 2 టన్నుల వరకు పడిపోతుంది. ఈ సంవత్సరం పూత, కాత ఆశాజనకంగా ఉండడంతో 4 టన్నుల వరకు దిగుబడి వస్తుందని హార్టికల్చర్ అధికారులు పేర్కొన్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం మామిడి పండ్లు కిలోకి రూ.70 పైగానే పలుకుతుంది.

జోరుగా అమ్మకాలు

మామిడి అమ్మకాలు జోరందుకున్నాయి. ప్రతి రోజూ పట్టణంలోని మార్కెట్‌కు మామిడి పండ్లు అమ్మకానికి వస్తున్నాయి. రాష్ట్రంలోని హైదరాబాద్‌తోపాటు కర్ణాటక, మహారాష్ట్రలకు సరఫరా కోసం లారీలు, ట్రాలీలు మామిడి తోటల వద్ద క్యూ కడుతున్నాయి. పట్టణంలోని మార్కెట్ వద్ద కూడా తెల్లవారు జామున పండ్లను తీసుకెళ్లడానికి ట్రాలీలు నిండిపోతున్నాయి. నాణ్యతను బట్టి ప్రస్తుతం టన్నుకు రూ. 30 వేల ధర పలుకుతోంది. గతేడాదితో పొల్చితే ఈ ఏడాది ధర ఎక్కువగా ఉన్నట్లు రైతులు, వ్యాపారులు చెబుతున్నారు.

“ దిగుబడి బాగానే ఉంది



కొన్నేళ్ల నుంచి మామిడి తోటలను సాగు చేస్తున్నాం. రెండు, మూడు సంవత్సరాల నుంచి నష్టపోతున్నాం. కిందటి ఏడాది చెట్లకు 25 శాతం కాయలు కూడా లేవు. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి నష్టపోయాం. కానీ ఈ సంవత్సరం ఫర్వాలేదు. దిగుబడితోపాటు ధర కూడా పలకడం వల్ల పెట్టుబడులు వస్తున్నాయి. సీజన్ ముగిసే వరకు ఇలాగే ఉంటే లాభాల్లో ఉంటాం.

– శివ, మామిడి రైతు, జహీరాబాద్

మృతదేహంతో ఇంటి ఎదుట ఆందోళన



నర్సింహులు మృతదేహం

మిరుదొడ్డి(దుబ్బాక): రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతికి కారణమయ్యాడంటూ మృతదేహంతో ఓ ఇంటి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన మండల పరిధిలోని చెప్యాలలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చెప్యాల గ్రామానికి చెందిన అక్కరాజు నర్సింహులు (36) ఈ నెల 26న దౌల్తాబాద్ మండలం దొమ్మాట నుంచి చెప్యాలకు బైక్‌పై వస్తున్నాడు. చెప్యాల గ్రామానికి చెందిన బాబు దొమ్మాటకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో నర్సింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పిర్యాదు మేరకు దౌల్తాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాబు కారణంగా నర్సింహులు మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు బాబు ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్, మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పరుశరాములు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా తమ వంతు ప్రయత్నం చేస్తామని, మృతదేహాన్ని తీసుకెళ్లాలని సీఐ శ్రీనివాస్ నచ్చజెప్పారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు శాంతించారు.

అభివృద్ధి కార్యక్రమాలే విజయానికి బాట



శ్రీగిరిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: బీఆర్‌ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే మెదక్ ఎంపీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తమ పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయానికి బాటలు వేస్తాయని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ నాయకుల తీరుపై మండిపడ్డారు. నాలుగు నెలల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. సాగునీరు, విద్యుత్ కొరతతో రైతులు అల్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మేస్థితిలో లేరని చెప్పారు. కాంగ్రెస్ వైఫల్యాలను గడపగడపకు తీసుకెళ్లి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తామన్నారు. కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ జేజాల వెంకటేశ్‌గౌడ్, నాయకులు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, కొల్గూరు స్వామి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు కృష్ణాగౌడ్, ఎంపీటీసీ ఆంజనేయులు, నాగిరెడ్డి, పాల రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు, అనారోగ్యం బాధతో ఒకరు



సత్తయ్య (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కల్లెపెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ క్రిష్ణారెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కోరి కొప్పుల సత్తయ్య(50)కు భార్య శోభ, ముగ్గురు కుమారులు అనీల్, హరీశ్, విష్ణు ఉన్నారు. పాత ఇల్లు శిథిలమవడంతో లోన్ తీసుకొని రెండేళ్ల కిందట ఇంటిని నిర్మించాడు. వ్యవసాయ అవసరాలకు ప్రైవేటు బ్యాంకులో లోను తీసుకొని ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. తనకున్న కొంత భూమిలో వరి సాగు చేయడంతోపాటు బెజ్జంకి శివారులోని పాపన్నపల్లెలో 3 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్నాడు. మూడేళ్లుగా పంటల దిగుడి లేక అవసరాల కోసం చేసిన అప్పులతో కలిపి సుమారు రూ.20 లక్షలు అయ్యాయి. దీంతో మనస్తాపం చెంది వ్యవసాయ బావి వద్ద శుక్రవారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు హరీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల పాలై యువకుడు..

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన కుకునూర్‌పల్లి మండలంలోని పీటీ వెంకటాపూర్‌గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పేర్క నర్సింలు(24) గ్రామంలో వ్యవసాయ కూలి పనులు చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో అప్పులపాలై, కుటుంబ కలహాలు రావడంతో జీవితంపై విరక్తి చెందాడు. శుక్రవారం ఉదయం పొలం సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



నర్సింలు (ఫైల్)

అనారోగ్యం బాధతో ..

దుబ్బాక: అనారోగ్యం బాధను భరించలేక జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన దుబ్బాక పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు కథనం మేరకు.. పట్టణంలోని డబుల్ బెడ్రూం కాలనీలో ఉండే దేవుని స్వామి (42) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.కొన్ని నెలలుగా స్వామి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ బాధను భరించలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఉమ ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మట్టి దందాపై కొరడా

- నాలుగు టిప్పర్లు పట్టివేత
- రూ.20వేల జరిమానా



పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలోని గొరవెల్లి, కట్కూర్, రేగొండ గ్రామాల్లో మట్టి దందా జోరుగా కొనసాగుతోంది. ట్రాక్టర్లు, టిప్పర్లతో యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో రేగొండ గ్రామం శివారులో మట్టిని తరలిస్తున్న అక్రమార్కులపై పోలీసులు కొరడా ఝులిపించారు. ఎస్సై తాండ్ర వివేక్ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేసి నాలుగు టిప్పర్లను పట్టుకున్నారు. టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ ఇంజమూరి సంజీవ్‌కుమార్ నాలుగు టిప్పర్లకు రూ.20 వేలు జరిమానా విధించారు.

నాచగిరి భక్తులపై దాడి

ఇద్దరిపై కేసు నమోదు

వర్గల్(గజ్వేల్): నాచగిరి పుణ్యక్షేత్రానికి వచ్చిన భక్తులపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గౌరారం ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ములుగు మండలం కొక్కొండకు చెందిన ఆశ్లె వెంకటేశ్ కుమారుడి పుట్టువెంట్రుకలు తీయించేందుకు కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి శుక్రవారం నాచగిరి క్షేత్రానికి వచ్చాడు. అదే రోజు రాత్రి 11.30 గంటలకు క్షేత్రం సమీపంలో అద్దెకు తీసుకున్న గదికి మద్యం తెచ్చుకున్నారు. నాచారం గ్రామానికి చెందిన కొత్తపల్లి భాను, కూచారం భానుప్రసాద్ అక్కడికి వచ్చి మద్యం తీసుకెళ్తుండడంతో ఇదేంటని బంధువు అచ్చం అనీల్ వారిని ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇనుపరాడ్‌తో అనీల్‌ను కొట్టడంతో తలపై గాయమైంది. ఆపేందుకు వెళ్లిన వెంకటేశ్, రాగిని కిరణ్‌ను సైతం కొట్టారు. దాడికి పాల్పడిన భాను, భానుప్రసాద్‌లపై శనివారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

పది మందికి గాయాలు

- అక్కన్నపేటలో బోల్తా పడ్డ ఆటో
- కొల్చారంలో ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆటో బోల్తా పడి ఏడుగురికి గాయాలైన ఘటన శనివారం అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. రామవరం నుంచి హుస్నాబాద్‌కు ప్రయాణికులతో ఆటో వెళ్తుంది. మరో ఆటో హుస్నాబాద్ నుంచి రామవరం వెళ్తుంది. మార్గమధ్యలో చౌటకుంట తండాకు రాగానే రెండో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇందులో ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా పడడంతో ఏడుగురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను108 అంబులెన్స్ సాయంతో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆటోను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

కొల్చారం(నర్సాపూర్): ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని మెదక్ జోగిపేట ప్రధాన రహదారి వరి గుంతం గేటు వద్ద శనివారం చోటు చేసుకుంది. కొల్చారం ఎస్‌ఐ మొహమ్మద్ గౌస్ కథనం మేరకు.. అందోల్ మండలం పోసానిపేటకు చెందిన దామోదర్ ఆటోలో రంగంపేట నుంచి ప్రయాణికుడిని తీసుకొని మెదక్ వైపు వెళ్తున్నాడు. వరిగుంత గేటు వద్దకు రాగానే పటాన్ చెరు వెళ్తున్న మెదక్ డిపో ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తోపాటు రంగంపేట గ్రామానికి మౌలానా గాయపడ్డాడు. అలాగే బస్సు వెనుక నుంచి బైక్ పై వస్తున్న వ్యక్తి బస్సును ఢీకొని గాయపడ్డాడు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ధాన్యాన్ని ఆరబోసిన కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గిరాకీ చేసేందుకొచ్చి ఆభరణాలు చోరీ

మాటల్లో పెట్టి 50 తులాల వెండి అపహరణ

కొడిపల్లి(నర్సాపూర్): గిరాకీ చేసేందుకు వచ్చారు.. ఆభరణాలు చూపించమన్నారు.. అవి ఇవి చూసి మాటల్లో పెట్టి వెండి ఆభరణాలు చోరీ చేశారు. ఈ ఘటన శనివారం కొడిపల్లిలోని రాందేవ్ జ్యువెలరీ, పాన్‌బ్రోకర్ షాపులో చోటు చేసుకుంది. షాపు యజమాని ప్రేమ్ కుమార్ కథనం మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లగా పిల్లలు, వర్కర్ షాపులో ఉన్నారు. షాపులో గిరాకీ చేసేందుకు ఇద్దరు ఆడవాళ్లు, ఒక మగ వ్యక్తి వచ్చారు. వెండి ఆభరణాలు చూపించాలని చెప్పడంతో 20 తులాల పట్ట గొలుసులు, 30 తులాల సాలం కడియాలు చూపించారు. అవి ఇవి చూస్తూ మాటల్లో పెట్టి 50 తులాల ఆభరణాలతో ఉడాయించారు. రాత్రి షాపులో లెక్క చూసేందుకు చూడగా అందులో పట్ట గొలుసులు, సాలం కడియాలు కనిపించలేదు. సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించగా ఇద్దరు మహిళలు, మగ వ్యక్తి ఆభరణాలు చోరీ చేసినట్లు బయటపడింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నారు. చోరి చేసిన వ్యక్తులను గుర్తించి పట్టించిన వారికి నగదు బహుమతి ఇస్తానని షాపు యజమాని పేర్కొన్నారు.



సీసీఫుటేజీలో దొంగలు

ఫినాయిల్ తాగిన వృద్ధురాలు

చికిత్స పొందుతూ మృతి

రాయపోలు(దుబ్బాక): పొరపాటున మంచి నీళ్లు అనుకొని ఫినాయిల్ తాగిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. రాయపోలు ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. మండల కేంద్రమైన రాయపోలుకు చెందిన పంబాల నర్సమ్మ (75) ఈ నెల 9న ఇంట్లో తాగునీటి సీసా అనుకొని ఫినాయిల్ తాగింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందితూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కోడలు భారతి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

పటాన్ చెరు టౌన్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేష్ నాయక్ కథనం ప్రకారం.. పటాన్ చెరు డివిజన్ పరిధిలో మార్చి 20వ తేదీన గుర్తు తెలియని 60 ఏళ్ల వయస్సు గల వ్యక్తి బజాజ్ ఎలక్ట్రానిక్ షాప్ ఎదుట రోడ్డుపై పడి ఉన్నాడు. స్థానికులు చూసి పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వృద్ధుడి మానసిక స్థితి బాగా లేక వైద్య సిబ్బందికి అతడి వివరాలు కూడా చెప్పలేదు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు.

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు



మాట్లాడుతున్న మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఎన్నికల కోడ్‌ను పట్టించుకోకుండా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న చేర్యాల సీఐ శ్రీను, ఎస్‌ఐ దామోదర్‌పై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి తెలిపారు. శనివారం పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఐ, ఎస్‌ఐ రాజకీయాలకతీతంగా ఉంటూ చట్టాన్ని కాపాడాల్సి ఉండగా ఒక పార్టీకి కొమ్ము కాయడం సరికాదన్నారు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, గత నెల 20వ తేదీన కొమురవెల్లి దేవస్థాన ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ధర్మ సభ నిర్వహణపై లిఖితపూర్వక ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు. సమావేశంలో నాయకులు సత్తిరెడ్డి, శశిధర్, భాస్కర్, వెంకట్‌మావో, యాదగిరి, రవికుమార్, నాగరాజు, కృష్ణారెడ్డి, అరుణ్, ప్రశాంత్, శోభ, శారద, నవీన, ప్రభాకర్, మల్లేశం, రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మిరుదొడ్డి(దుబ్బాక): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జిల్లా టాస్క్ ఫోర్స్, భూంపల్లి పోలీసులు శనివారం సీజ్ చేశారు. భూంపల్లి ఎస్‌ఐ రవికాంత్ రావు తెలిపిన వివరాలు వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి నుంచి అబ్దుల్ రెహమాన్ తరలిస్తున్న రేషన్ బియ్యంతో పాటు, రామాగౌడ్ బైక్‌పై తరలిస్తున్న మొత్తం 10.86 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన మహంకాళి కృష్ణ ఇంట్లో నిల్వ ఉంచిన 5.50 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనాల తనిఖీల్లో నగదు సీజ్

రూ. 43 లక్షలు

సిద్దిపేటకమాన్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.43,72,410 నగదు సీజ్ చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు నిర్వహించిన వాహన తనిఖీల్లో పలువురు వ్యక్తులు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. రూ.26,55,006 విలువ గల 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.30,528 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు.

రూ.1.06 లక్షలు పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట): వాహనాల తనిఖీలో ఇద్దరి వ్యక్తుల వద్ద రూ.1.06 లక్షలు పట్టుకొని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు శనివారం ఎస్‌ఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

రూ.65 వేలు

కొమురవెల్లి(సిద్దిపేట): పోలీస్‌స్టేషన్ పరిధిలోని గురిజకుంట కమాన్ వద్ద ఎస్‌ఐ నాగరాజు సిబ్బందితో కలిసి శనివారం వాహనాలను తనిఖీ చేశారు. చేర్యాల పట్టణానికి చెందిన నగేశ్ కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.65 వేలను స్వాధీనం చేసుకున్నారు.

రూ. 6,38,350 నగదు సీజ్

సిద్దిపేటరూరల్: వాహనాల తనిఖీల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం 5 గంటల వరకు పలువురు వ్యక్తుల నుంచి రూ. 6,38,350 ల నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ అపూర్వరెడ్డి తెలిపారు. సీపీ అనురాధ ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్ పరిధిలో గల రాఘవాపూర్ బస్టాండు, లక్ష్మీదేవి పల్లి చౌరస్తా, పుల్లూరు క్రాస్ రోడ్, బూరుగుపల్లి క్రాస్ రోడ్‌లో వాహనాల తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేసి ఎఫ్‌ఎస్‌టీ ఇన్‌చార్జికి అందజేసినట్లు తెలిపారు. తనిఖీల్లో సీఐ శ్రీను , రూరల్ ఎఫ్‌ఎస్‌టీ ఇంచార్జీ రంజిత్, నారాయణరావుపేట ఎఫ్‌ఎస్‌టి టీం యాదగిరి, హరిప్రసాద్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దిపేటరూరల్: ఎఫ్‌ఎస్‌టీ అధికారికి సీజ్ చేసిన డబ్బును అందిస్తున్న పోలీసులు

రూ. 3.52 లక్షలు

మిరుదొడ్డి(దుబ్బాక): వాహన తనిఖీల్లో భాగంగా ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.3.52 లక్షలను ఎలక్షన్ తనిఖీ అధికారులతో కలిసి పట్టుకున్నట్లు మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పరుశరాములు తెలిపారు. సీజ్ చేసిన డబ్బులకు సంబంధించి రసీదులను డబ్బులు తరలిస్తున్న వారికి అందించడం జరిగిందన్నారు. అలాగే దౌల్తాబాద్ మండల కేంద్రంలో తనిఖీ నిర్వహిస్తుండగా ఎలాంటి పత్రాలు లేకుండా రూ.60 వేలు కారులో తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకొని ఎఫ్‌ఎస్‌టీ టీమ్‌కు అప్పగించినట్లు దౌల్తాబాద్ పోలీసులు తెలిపారు.



మిరుదొడ్డి(దుబ్బాక): రసీదులను అందిస్తున్న పోలీసులు

రూ.99,500

జహీరాబాద్ టౌన్: మండలంలోని మాడ్గి చెక్ పోస్టు వద్ద శనివారం పోలీసులు రూ. 99,500 నగదును పట్టుకున్నారు. డబ్బును ఎన్నికల అధికారులకు అప్పగించామని చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.